


## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## బహుమతి పొందిన ఉత్తమ నవల
## (గత సంచిక తరువాయి)

**బోసుది బెంగాలీ కుటుంబం.** ఆయన తండ్రి కటక్‌లో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసేవాడు. 8 మంది కొడుకులు, 6 గురు కూతుర్లు ఉన్న సంసారం వారిది. ఆర్థికంగా స్థితి మంతులే. ఆ సంతానంలో ఆరవ వాడిగా 1897, జనవరి 23 న పుట్టాడు సుభాస్ చంద్ర బోస్.

1905 లో బ్రిటిషు ప్రభుత్వం మత ప్రాతిపదికన బెంగాలును తూర్పు బెంగాల్, పశ్చిమ బెంగాల్ అంటూ రెండుగా విభజించింది. తమను సంప్రదించకుండా, తమకు ఇష్టం లేకుండా జరిగిన విభజన మీద బెంగాల్ యువత మండి పడింది. ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడటానికి ఎన్నో విప్లవ సంస్థలు పుట్టుకు వచ్చాయి. అన్నిటి ధ్యేయం ఒక్కటే. బ్రిటిషు వారి మీద దాడులు చేయటం. మతంతో సంబంధం లేకుండా బెంగాలో మాట్లాడే ప్రజలందరు బెంగాలు విభజన నిర్ణయానికి వ్యతిరేకత వెలిబుచ్చారు.

ఆరు సంవత్సరాలు గడిచినా గొడవలు ఏ మాత్రం తగ్గక పోవటంతో, బ్రిటిషు ప్రభుత్వానికి 1911 లో బెంగాల్ విభజన రద్దు చేయక తప్పలేదు. ర్స్ఢ చేసినట్లే చేసి మరో విధంగా బెంగాలును విభజించారు. ఈసారి మత ప్రాతిపదికన కాకుండా భాషా పరంగా బెంగాల్‌ని విడగొట్టారు. బెంగాలు నుండి ఒరిస్సాని, బీహార్‌ని వేరు చేశారు. అంతేకాకుండా ఏమాత్రం సహకరించని బెంగాలు ప్రజల మధ్య బ్రతక లేక దేశ రాజధానిని అదే సంవత్సరం ఢిల్లీకి మార్చారు.

ప్రభుత్వం బెంగాలు విభజన రద్దు చేసుకోవటంతో, బెంగాలు కేంద్రంగా పనిచేస్తున్న విప్లవ సంస్థలకు తమ పంథా సరయినదే అన్న నమ్మకం కలిగింది. గాంధీ మార్కు అహింసా రాజకీయాల వలన బ్రిటిషు వారు భయపడరని, వారిని భయపెట్టాలంటే బల ప్రయోగమే సరయినదనే భావన విప్లవ సంఘాలలో బలంగా వ్యాపించింది.

నేతాజీ యువకుడుగా ఎదుగుతున్నపుడు అతని చుట్టూ ఉన్న రాజకీయ వాతావరణం ఇది. తను కూడా ఆ విప్లవ భావాలకు ప్రభావితం అయ్యాడు బోస్. ఒక వైపు విప్లవ భావాలు, మరో వైపు ఆధ్యాత్మికత రెంటి మీద అతని ఉత్సుకత పెరిగి పోయింది. కటక్ దగ్గరలో ఉన్న పూరీ క్షేత్రానికి ఎక్కువగా వెళ్తూ ఉండేవాడు. అక్కడకు వచ్చిన సాధువులు, యోగులతో తన సందేహాలు పంచుకునే వాడు. పదహారు సంవత్సరాల వయసులో తత్వశాస్త్రం చదవటం మొదలు పెట్టాడు. వివేకానందుడి బోధనలకు తీవ్రంగా ప్రభావితమయ్యాడు.

పంతొమ్మిదేళ్ళ వయసులో ఆంగ్లేయ లెక్చరర్ మీద దాడి చేసినందుకు కాలేజి నుండి బహిష్కరించబడ్డాడు. బహిష్కరణకు అయినా ఒప్పుకున్నాడు తప్ప క్షమాపణ చెప్పటానికి అంగీకరించలేదు.

ఒక సంవత్సరం తరువాత తిరిగి కాలేజీలో చేరి కోర్సు పూర్తి చేశాడు. ఇండియన్ సివిల్ సర్వీస్ పరీక్ష రాయటానికి లండన్ వెళ్లాడు. ఆరు నెలలు చదివి ఇండియన్ సివిల్ సర్వీస్ పరీక్షలో నాలుగో ర్యాంకు సాధించాడు.

ఇంతలో భారతదేశంలో జలియన్‌వాలాబాగ్ దురంతం జరిగింది. అంతటి దురాగతం జరిగినా... చనిపోయిన భారతీయుల మీద సానుభూతి లేకపోగా, చంపిన వారిని సమర్ధించుకుంటున్న బ్రిటిషు నాయకుల మీద నమ్మకం పోయి తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఇండియాకు తిరిగి వచ్చాడు. అతని రాజీనామాకు మరో కారణం కూడా ఉంది. బ్రిటిషు ఉన్నత వర్గాల్లో ఇంకో వందేళ్ళు గడిచినా భారత దేశానికి స్వాతంత్రం ఇవ్వటం జరిగే పని కాదని ఒక మాట వినిపిస్తూ ఉండేది. లండన్‌లో ఉన్న బోస్ ఆ మాటలు సహించలేక పోయాడు. అందుకే స్వాతంత్ర పోరాటంలో దిగి స్వయంగా తేల్చుకోవాలని నిర్ణయించుకున్నాడు.

భారతదేశం రాగానే గాంధీని కలుసుకున్నాడు. “నేను, నా లాంటి యువకులు ప్రాణాలు ఇవ్వటానికి తయారుగా ఉన్నారు. మీరు ఎప్పటి లోపు స్వాతంత్రం ఇప్పించగలరు?” అని అడిగాడు. నవ్విన గాంధీ, “ఎవరి ప్రాణాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఒక సంవత్సరంలో స్వాతంత్రం వస్తుంది...” అని చెప్పాడు. ఒక సంవత్సరం గడిచేటప్పటికి బోసుకు గాంధీ పద్ధతుల మీద విశ్వాసం సడలింది.

కలకత్తా వెళ్ళి తనదయిన పోరాటాన్ని కొనసాగించాడు. దేశబంధు చిత్తరంజన్ దాస్‌ను తన గురువుగా స్వీకరించాడు. కలకత్తా ప్రజలను తన ఉపన్యాసాలతో ఉర్రూతలూగించాడు. కలకత్తా కార్పొరేషన్‌కి జరిగిన ఎన్నికలలో చిత్తరంజన్ దాస్ మేయర్‌గా, తను సి.ఈ.ఓ.గా పదవిని అలంకరించాడు. 27 ఏళ్ల వయసులో ఒక యువకుడు అలాంటి పదవిని చేపట్టటమే అరుదు అనుకుంటే, దానిని అత్యంత సమర్ధవంతంగా నిర్వహించాడతను.

అయితే ఒక సంవత్సరం గడిచిందో, లేదో బోస్ విప్లవకారులకు సహకరిస్తున్నాడన్న ఆరోపణల మీద అరెస్టు చేసి మాండలే జైలుకు తరలించారు. రెండు సంవత్సరాల జైలు జీవితం అతని ఆరోగ్యాన్ని దెబ్బ తీసింది. మెరుగయిన వైద్యం కోసం పెరోల్ తీసుకుని యూరప్ లోని వియన్నా వెళ్లాడు. అక్కడ నుండి బెర్లిన్, రోమ్, ప్రేగ్, వార్సా, ఇస్తాంబుల్, బెల్‌గ్రేడ్, బుకారెస్ట్ లాంటి యూరోపియన్ నగరాలన్నీ తిరిగాడు. అక్కడి రాజకీయనాయకులను, ప్రభుత్వ అధికారులను కలిసి

భారతదేశంలో త్వరలో సాయుధ తిరుగుబాటు జరగబోతోందని, బ్రిటిషు వారిని తరిమి కొట్టబోతున్నామనీ, తమకు సహకరించమనీ అడిగేవాడు. ఆ విధంగా బోస్ ప్రపంచానికి పరిచయమయ్యాడు.

తిరిగి ఇండియా తిరిగివచ్చిన బోస్ కాంగ్రెస్ రాజకీయాలలో కొనసాగాడు. అప్పటికే దేశ, విదేశాల్లో గాంధీ, నెహ్రూ తరువాత బోస్ పేరు ప్రముఖంగా వినిపించసాగింది. అనేక పోరాటాలు చేశాడు. కాంగ్రెస్ భావజాలాన్ని అంగీకరించక పోయినా, ఒకసారి అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయితే, కాంగ్రెస్ పార్టీని తన దారిలోకి తెచ్చుకోవచ్చనీ, తన ప్రభావం దేశం మీద చూపించవచ్చనీ భావించాడు.

1939 లో గాంధీ నిలబెట్టిన భోగరాజు పట్టాభి సీతారామయ్య మీద గెలిచి కాంగ్రెస్ ప్రెసిడెంట్ అయ్యాడు. కానీ అతనికి ఒక వైపు ఆరోగ్యం సహకరించ లేదు. మరో వైపు కాంగ్రెస్ పార్టీ నుండి సహకారం లభించ లేదు. పార్టీకి రాజీనామా చేసి బయటకు వచ్చాడు. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించాడు.

ఇంతలో హిట్లర్ రెండవ ప్రపంచ యుద్ధం మొదలు పెట్టాడు.

జర్మనీ, జపాన్, ఇటలీ ఒక వైపు మోహరిస్తే రెండవ వైపు బ్రిటన్, ఫ్రాన్స్ ఉన్నాయి. అమెరికా, రష్యాలు మొదట్లో తటస్థంగా ఉన్నాయి.

ఆపత్కాలంలో బ్రిటిషు ప్రభుత్వానికి సహకరిస్తే, యుద్ధం ముగిసాక స్వాతంత్రం ఇస్తామని బ్రిటిషు ప్రభుత్వం భారతీయ నాయకులకు నచ్చ చెప్పింది.

అయితే బోస్ అభిప్రాయం వేరుగా ఉంది. బ్రిటన్ మీద తిరుగుబాటు చేసి వత్తిడి పెంచటానికి ఇదే సమయమని, అందుకు సాయుధ తిరుగుబాటే సరయినదనీ భావించాడు. అందుకు జర్మనీ నియంత హిట్లర్ సాయం తీసుకోవటంలో తప్పు లేదని భావించాడు.

బ్రిటిషు ప్రభుత్వం సహజంగానే బోసు భావాలను సహించలేక పోయింది. నిజంగా బోసు అనుకున్నట్లు జరిగితే అది బెటిషు సామ్రాజ్య పతనానికి దారి తీస్తుందని వారికి తెలుసు. అందుకే యుద్ధం పూర్తి అయ్యే వరకు అతన్ని జైలులో బంధించి ఉంచాలని నిర్ణయించుకుంది. 1940, జులై 2 న బోసును అరెస్టు చేసి జైలులో పెట్టింది.

జైలులో బోసు ఖాళీగా కూర్చో లేక పోయాడు. ప్రపంచమంతా యుద్ధం జరుగుతోంది. దేశ యువత తమకు సాధ్యమయినంతగా పోరాటం చేస్తున్నారు. 25 లక్షల మంది భారతీయులను బ్రిటిషు ప్రభుత్వం ప్రపంచ వ్యాప్తంగా తన తరుపున యుద్ధంలోకి దించింది. అందులో వేలాది మంది ప్రాణాలు వదులుతున్నారు. భారత యువత బ్రిటిషు ప్రభుత్వం తరుపున పోరాడటాన్ని బోసు వ్యతిరేకించాడు. దానికి బదులు సరాసరి బ్రిటిషు ప్రభుత్వం మీద తిరుగుబాటు చేయాలని భావించాడు. అలా చేయాలంటే ముందు తను జైలు నుండి బయట పడాలి. జర్మనీని భారతీయ యువతకు సహాయం చేయటానికి ఒప్పించాలి.

తనను అన్యాయంగా నిర్బంధించారు కాబట్టి వెంటనే విడుదల చేయమని డిమాండు చేస్తూ నిరాహార దీక్షకు కూర్చున్నాడు బోసు. ఏడు రోజులు గడిచినా ఆహారం తీసుకోలేదు. దీక్ష విరమించ లేదు. బలవంతంగా ఆహారం ఎక్కించటాన్ని తీవ్రంగా ప్రతిఘటించాడు బోసు.

అతని ఆరోగ్యానికి ఏదన్నా హాని జరిగితే అల్లర్లు ఇంకా ఎక్కువవుతాయని భావించిన ప్రభుత్వం అతన్ని విడుదల చేసి గృహ నిర్బంధం చేయటానికి ఒప్పుకుంది. కలకత్తాలోని ఎల్జిన్ రోడ్డులో ఉన్న అతని పూర్వీకుల ఇంటిలోనే బోసును గృహ నిర్బంధం చేశారు.

బ్రిటిషు పోలీసులు, గూఢచారులు ఇంటి చుట్టూ ఇరవై నాలుగు గంటలు కాపలా కాసేవారు. ఎట్టి పరిస్థితుల్లో బోసును ఇంటి నుండి అడుగు కూడా బయట పెట్టనియ్యవద్దని వారికి ఉన్న ఆర్డరు.

అంతటి కాపలా మధ్య బోసు ఏ రాజకీయ నాయకుడూ చేయని సాహసం చేయటానికి ఒడికట్టాడు.

1940, డిసెంబరు 29 న వైస్‌రాయ్‌కి బెంగాలులోని రాజకీయ పరిస్థితుల మీద ఒక ఉత్తరం రాస్తూ, తాను లేవలేని పరిస్థితులలో ఉన్నాననీ, మంచం మీద నుండి ఈ ఉత్తరం రాస్తున్నాననీ ప్రస్తావించాడు. నిజంగానే బోసు అనారోగ్యంతో ఉన్నాడని నమ్మాడు వైస్‌రాయ్. బోసు అనారోగ్యం గురించి అనేక వార్తలు పత్రికలలో వచ్చేలా తనే చూశాడు బోసు. రోజూ రెండు పూటలా వివిధ డాక్టర్లు ఇంటికి వచ్చి బోసును పరీక్షించి వెళ్తూ ఉండేవాళ్లు. ఇంటిని కాపలా కాస్తున్న గూఢచారులు కూడా బోసు అనారోగ్యం నిజమే అని నమ్మేలా చేశాడు.

1941, జనవరి 17 తెల్లవారుజామున అతని ఇంటి నుండి ఒక కారు బయటకు వచ్చింది. దానిని నడుపుతోంది శిశిర్ కుమార్ బోస్. అతను బోస్ అన్న కొడుకు. డాక్టర్ కోర్సు చదువుతున్నాడు. అతను బోస్ ఆరోగ్యాన్ని పరీక్షించటానికి అప్పుడప్పుడూ డాక్టర్లతో ఈ ఇంటికి రావటం మామూలే. ఇప్పుడు కూడా అతను రావటం కానీ, వెళ్లటం కానీ ఇంటిని కాపలా కాస్తున్న పోలీసులకు, గూఢచారులకు ఎలాంటి అనుమానం కలిగించ లేదు. కారు లోపలకు తొంగి చూసిన వారికి అనుమానాస్పదంగా ఏమీ కనపడ లేదు. డిక్కీ తెరిపించి వెతకక పోవటంతో ఆ కారులో రహస్యంగా దాక్కున్న బోసు ఉన్నాడని ఎవరికీ అనుమానం రాలేదు.

కలకత్తా నగరానికి 210 మైళ్ల దూరంలో ఉన్న గోమా (ప్రస్తుతం బీహారులో ఉంది) వరకు అదే కారులో ప్రయాణించిన సుభాస్ చంద్ర బోస్, శిశిర్ బోసును వెనక్కి పంపేశాడు. తను గోమా నుండి పెషావర్ (ప్రస్తుత పాకిస్తాన్ లోని ఒక నగరం) వెళ్ళే రైలు ఎక్కాడు. పెషావర్‌లో భగత్‌రామ్ అనే వ్యక్తి సాయంతో ఖైబర్ పాస్ మీదుగా ఆఫ్ఘనిస్తాన్ ప్రయాణం మొదలు పెట్టాడు. పఠాన్ వేషంలో ఉన్న బోసుకు 'పష్తూ' భాష రాదంటే అందరికీ అనుమానం వస్తుంది కాబట్టి... అందరికీ అతన్ని మూగ, చెవిటి వ్యక్తిగా పరిచయం చేశాడు భగత్‌రామ్. భగతరామ్ కూడా తన పేరును రహమత్‌ఖాన్‌గా మార్చుకున్నాడు.

మెయిన్ రోడ్డు మీద వెళ్తే పాస్‌పోర్టులు అడుగుతారు కాబట్టి, ఖైబర్ పాస్ మొదలయ్యే జమ్రుద్ నుండి వేరే లోపలి మార్గాల మీదుగా ప్రయాణించారు. ఆయుధాలు ధరించిన ఇద్దరు పఠానులు వారికి దారి చూపించటానికి, రక్షణగా వచ్చారు. మొదటి రాత్రి ఒక గిరిజన గ్రామంలో, రెండవ రాత్రి అడ్డా షరీఫ్‌లోని ఒక మసీదులో గడిపి నాలుగు రోజుల తరువాత లాల్‌పురా చేరుకున్నారు. లాల్‌పురా మెయిన్ రోడ్డు దగ్గర వీరిని విడిచి పెట్టిన ఇద్దరు పఠానులు వెనక్కి వెళ్ళిపోయారు. ఒక పగలంతా వేచి ఉండి లారీలో ప్రయాణం మొదలు పెట్టారు. లారీ డ్రైవర్ వీరిని క్యాబిన్‌లో కూర్చోవటానికి అంగీకరించ లేదు. లారీ వెనుక సామానుల మధ్య కూర్చుని, కురుస్తున్న మంచులో 36 గంటలు ప్రయాణించి కాబూల్ లోయ దగ్గరకు చేరుకున్నారు. కొంత దూరం అద్దె కారులో, మరి కొంత దూరం కాలి నడకన ప్రయాణించి ఎట్టకేలకు కాబూల్ చేరుకున్నారు.

ఎముకలు కొరికే చలి వాతావరణం, అలవాటు లేని శారీరక శ్రమ కలిపి బోసుని నీరసింప చేశాయి. లారీ డ్రైవర్లు ఉండే ఒక సత్రంలో వారు ఒక గదిని అద్దెకు తీసుకున్నారు. వరుసగా అయిదు రోజులు కాబూల్‌లోని జర్మనీ రాయబారిని కలుసుకోవాలని ప్రయత్నించి విఫలమయ్యాడు బోసు. కాబూల్ నిండా బ్రిటన్ గూఢచారులు ఉన్నారు. సుభాస్ చంద్ర బోస్ ఉనికి తెలిసిన పక్షంలో అర క్షణంలో అరెస్టు చేస్తారు. అందుకే అత్యంత రహస్యంగా పనిచేయవలసి వచ్చేది.

అయిదు రోజుల శ్రమ తరువాత కూడా జర్మన్ రాయబారిని కలుసుకోలేక పోయిన బోసు ఎట్టకేలకు ఇటలీ రాయబారిని కలుసుకో గలిగాడు. అక్కడ అతనికి మంచి ఆహ్వానమే లభించింది. “మీ శత్రువు, మా శత్రువు ఒకరే. మీరు కొద్దిగా సాయం చేయండి. ఇండియా పేలటానికి సిద్ధంగా ఉన్న అగ్ని పర్వతంలా ఉంది, మా యువత సాయంతో బ్రిటిషు వారిని మా దేశం నుండి తరిమి కొడతాం...” అని వారికి నచ్చ చెప్పే ప్రయత్నం చేశాడు బోసు. తాము అతనికి పాస్‌పోర్టు ఏర్పాటు చేస్తామనీ, రష్యా మీదగా రోమ్ కానీ, బెర్లిన్ కానీ చేరుకుని రాజకీయ చర్చలు జరపమనీ వారు సలహా ఇచ్చారు.

ఇటలీ ప్రభుత్వం నుండి పాస్‌పోర్టులు రావటానికి ఆరు వారాల సమయం పట్టింది. ఈలోపు బోసు అదృశ్యం అయిన వార్త జనవరి 26 న బ్రిటిషు అధికారులకు తెలిసింది. బోసు జర్మనీ చేరితే తమకు నష్టమని అర్థం చేసుకున్న బ్రిటిషు ప్రధానమంత్రి చర్చిల్ ఎట్టి పరిస్థితుల్లో బోస్ జర్మనీ చేరకూడదని ఆదేశించాడు. అతన్ని ఆపే ప్రయత్నంలో అతని ప్రాణాలు పోయినా పట్టించుకోవద్దని వారి గూఢచారులకు ఆదేశాలిచ్చాడు. బ్రిటిషు గూఢచారులు బోసు ఇరాన్, ఇరాక్, టర్కీ మీదగా జర్మనీ వెళ్తాడని ఊహించి ఆ దేశాల్లో తమ వెతుకులాట తీవ్రతరం చేశారు. తమ నిఘా రెట్టింపు చేశారు. అయితే బోసు రష్యా మీదగా జర్మనీ చేరుకునే ప్రయత్నాల్లో ఉన్నాడు. కాబూల్‌లో కూడా బోసు కోసం వెతుకులాట మొదలయింది. ఇక ఆ సత్రంలో ఉండటం ఏమాత్రం క్షేమం కాదని భావించిన బోసుకు ఉత్తమ్‌చంద్ అనే భారతీయుడు ఆశ్రయం ఇచ్చాడు.

ఎట్టకేలకు మార్చి 18 న 'ఒర్లాండో మసాటా' అనే ఇటాలియన్ పేరుతో బోసుకు పాస్‌పోర్టు వచ్చింది. దొంగ పాస్‌పోర్టు సాయంతో తన ప్రయాణం తిరిగి మొదలు పెట్టాడు బోసు. కాబూల్ నుండి బొఖారా మీదుగా హిందూకుష్ పర్వతాలను అధిగమించి, తష్కుర్‌గాన్ లోయలను దాటి, మాస్కో వెళ్లే రైలు ఎక్కాడు. మాస్కో చేరిన అతన్ని 1941, మార్చి 28 న విమానంలో బెర్లిన్ చేర్చారు జర్మనీ అధికారులు.

అయితే బెర్లిన్ చేరటంతో బోసు ప్రయాణం పూర్తి కాలేదు, నిజానికి అతని పని అప్పుడే మొదలయింది.

అధికారికంగా జర్మనీ బోసు ఉనికిని గుర్తించలేదు. అతన్ని ఒర్లాండో మసాటా అనే పేరుతోనే పిలిచే వారు. కానీ జర్మనీ ప్రభుత్వం అతనికి అన్ని విధాలుగా సాయం చేసింది. అతని కోసం ఉద్యోగస్తులను ఇచ్చింది. అతని భావాలను ప్రసారం చేయటానికి రేడియో ఏర్పాటు చేసింది. ఆఫ్రికాలో బ్రిటిషు వారి తరుపున పోరాడుతూ బందీలయిన వేలాది మంది భారతీయులను బోసుకు అప్పగించింది. వారికి తర్ఫీదును ఇచ్చి సరయిన సమయంలో పారాచూట్ల ద్వారా భారత దేశంలోకి పంపాలన్నది బోసు యోజన. జర్మనీ సహకారంతో భూమార్గం ద్వారా రష్యా, ఆఫ్ఘనిస్తాన్ మీదుగా ఇండియా చేరుకోవాలనీ, ఈలోపు పారాచూట్ల ద్వారా భారత దేశంలోకి ప్రవేశించిన సైనికులు భారతీయ యువతను తిరుగుబాటుకు సన్నద్ధంగా ఉంచుతారనీ, జర్మన్ దళాలు, భారతీయ సైన్యం, తిరుగుబాటుదారులు కలిసి చేసే దాడిలో బ్రిటిషు సైన్యం ఓటమి కాక తప్పదని బోసు భావించాడు.

ఇవన్నీ చేయటానికి జర్మన్ ప్రభుత్వాన్ని బోసు అడిగింది ఒకటే – మేము ఒక విదేశీ పాలన నుండి మరో విదేశీ పాలనలోకి వెళ్లటానికి తయారుగా లేము. కాబట్టి, బ్రిటిషు వారిని జయించిన తరువాత భారతదేశం విషయంలో ఏమాత్రం జోక్యం చేసుకోకూడదు... అన్న హామీ.

అయితే హిట్లర్ మనసులో ఏముందో కానీ బోసుకు ఆ విషయంలో జర్మనీ నుండి చివరి వరకు ఎలాంటి వాగ్దానం లభించలేదు. ఈలోపు హిట్లర్ అప్పటిదాకా తన మిత్రుడిగా ఉన్న రష్యా మీద దాడి చేశాడు. రష్యా కూడా జర్మనీ మీద యుద్ధం ప్రకటించింది. దానితో బోసు ప్రణాళికలో ముఖ్య భాగమయిన రష్యా మీదగా భూ మార్గం ద్వారా ఇండియా ముట్టడి అసాధ్యమని తేలిపోయింది.

బోసు జర్మనీలో ఉండగానే "జైహింద్" నినాదాన్ని ప్రాచుర్యం చేశాడు. తనను కలవటానికి ఎవరు వచ్చినా వారిని ఆ మాటతోనే పలుకరించేవాడు. అలానే వీడ్కోలు తీసుకునే సమయంలో కూడా అదే నినాదాన్ని వాడే వాడు.

నెమ్మది నెమ్మదిగా బోసుకు జర్మనీ మీద ఉన్న భ్రమలు తొలగిపోయాయి.

1942, మే 28 న హిట్లర్‌తో వ్యక్తిగతంగా సమావేశమయ్యాడు బోసు. తన ఉద్దేశాలు వివరంగా చెప్పాడు. అయితే హిట్లర్ అతని భావాలతో ఏకీభవించలేదు. భారతదేశంలో అప్పడే విప్లవం రాదనీ, ఒకవేళ వచ్చినా... పదివేల మంది సుశిక్షితులయిన సైనికులు ఆయుధాలు లేని పది లక్షల మంది తిరుగుబాటుదారులను కంట్రోల్ చేయగలరని వాదించాడు. ఇంకొద్దిగా ఆగి చూద్దామని చెప్పాడు. నిజానికి జర్మనీ అప్పటికే రష్యా చేతిలో చావు దెబ్బలు తింటోంది.

హిట్లర్ వెనుకడుగు వేయటానికి అది అసలు కారణం. దానితో బోసుకు ఇక అక్కడ ఉండి చేయగలిగింది ఏమీ లేదని అర్థమయింది.

జర్మనీ రష్యా మీద దాడి చేసి పెద్ద తప్పిదం చేసిందని బోసుకు అర్థమయింది. అలానే జపాన్ పెర్ల్ హార్బర్ మీద దాడి చేయటంతో అప్పటిదాకా తటస్థంగా ఉన్న అమెరికా కూడా యుద్ధంలోకి దిగింది.

అదే సమయంలో జపాన్ బ్రిటన్ మీద జరుగుతున్న యుద్ధంలో ఆసియాలో ముందుకు దూసుకు వెళ్తోంది. మలయా, సింగపూర్, హాంగ్‌కాంగ్ లను జయించి బర్మా మీద దాడికి సిద్ధమవుతోంది. ఒకసారి బర్మా జపాను వారి ఆధీనంలోకి వస్తే ఆ తరువాత ఉంది భారత దేశమే. సింగపూర్, రంగూన్ మీదగా కలకత్తా చేరుకోగలిగితే... ఇక భారతదేశ విముక్తి నల్లేరు మీద నడక అనుకున్నాడు బోసు. అందుకే తను జర్మనీలో ఖాళీగా కూర్చునే కంటే, జపాను వెళ్తే ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొనవచ్చన్న భావన బోసుకు ఏర్పడింది.

తనను జపాను పంపే ఏర్పాట్లు చేయమని జర్మన్ ప్రభుత్వాన్ని, తరువాత ఇటలీ ప్రభుత్వాన్ని కోరుకున్నాడు బోసు. యుద్ధం తీవ్రంగా ఉన్న ఆ పరిస్థితుల్లో, బోసు ప్రాణాల మీద గురి పెట్టి ఉన్న బ్రిటిషు ప్రభుత్వానికి చిక్కకుండా ఆయన్ని జపాను పంపటం అంటే మాటలు కాదు. ఆ రోజుల్లో ఇప్పట్లా సుదీర్ఘ ప్రయాణాలు చేసే విమానాలు లేవు.

అప్పటికే బ్రిటిషు ప్రభుత్వానికి కూడా బోసు జపాన్ రావాలనుకుంటున్నాడని తెలిసింది. నిజానికి బోసు కలకత్తా నుండి తప్పించుకున్నపుడే అతన్ని జర్మనీ చేరకుండా చూడాలని బ్రిటన్ విశ్వప్రయత్నం చేసింది. కాకపోతే అప్పుడు బోసుకు రష్యా సహకరించింది. ఎందుకంటే అప్పడది జర్మనీకి మిత్ర దేశం. ఇప్పుడు రష్యా బ్రిటనుకు మిత్ర దేశంగా మారింది. బ్రిటిషు ప్రభుత్వం బోసు కనక రష్యాలో అడుగుపెడితే అతన్ని బంధించి తమకు అప్పచెప్పాలని రష్యాను కోరింది. ఆ విధంగా భూమార్గం మీదుగా జపాను వెళ్లే అవకాశం లేదు. విమానంలో అయితే త్వరగా చేరుకోగలనని బోసు అనుకున్నాడు. కానీ చుట్టు తిరిగి అంత దూరం ప్రయాణించగల విమానాలు లేవు. ఆఖరికి అతన్ని జలాంతర్గామి ద్వారా జపానుకు పంపాలన్న నిర్ణయం తీసుకున్నారు జర్మనీ అధికారులు.

ఆ రోజుల్లో జలాంతర్గాములు డీజిల్‌తో నడిచేవి. ఒక్కసారి ఇంధనం నింపుకుంటే సరాసరి జర్మనీ నుండి జపాను చేరే శక్తి వాటికి లేదు. అన్ని దేశాలు యుద్ధంలో నిమగ్నమయి ఉన్నాయి. ఏ తీరానికి వెళ్తే ఎవరు బాంబులు వేస్తారో తెలియదు. పైగా ఎలా అయినా బోసును చంపాలని పట్టుబట్టి ఉంది బ్రిటిషు ప్రభుత్వం. దానితో జర్మన్ U–80 జలాంతర్గామిలో మడగాస్కర్ వరకు ప్రయాణించేటట్లు, అక్కడ నుండి జపాన్ I–21 జలాంతర్గామిలో జపాన్ చేరుకునేటట్లు ప్లాన్ చేశారు. మొదట జపాను నావీ ఒక సాధారణ ప్రయాణికుడిని తమ జలాంతర్గామిలోకి ఎక్కించుకోవటానికి ఇష్టపడలేదు. ఎక్కబోతున్నది ప్రవాసంలో ఉన్న ఇండియన్ ఆర్మీ సుప్రీం కమాండర్ అని తెలిశాక తమ నిబంధనలను సడలించుకుని ఆయన్ని తీసుకురావటానికి ఒప్పుకున్నారు. రెండవ ప్రపంచ యుద్ధంలోనే కాదు ఆ తరువాత ఇప్పటి వరకు ప్రపంచ చరిత్రలో జరిగిన అనేక యుద్ధాలలో ఏ రాజకీయ నాయకుడు, ఏ మిలటరూ

కమాండరూ ఇంతటి సాహసం చేయలేదు. 1943, ఫిబ్రవరి 28న మొదలయిన ఆయన ప్రయాణం ఏప్రిల్ 26 నాటికి మడగాస్కర్ తీరానికి చేరింది. జలాంతర్గామిలో సరిగ్గా కూర్చునే వెసులుబాటు లేదు. డీజిల్ వాసనతో కడుపులో తిప్పేది. సరయిన తిండి ఉండేది కాదు. మడగాస్కర్ తీరం చేరేటప్పటికి తీవ్రమయిన తుఫాను వారి కోసం ఎదురు చూస్తోంది. జపాను వారి జలాంతర్గామి ఎదురుగానే ఉన్నా తుఫాను కారణంగా రెండు రోజులు వేచి ఉండవలసిన పరిస్థితి. ఎట్టకేలకు రెండు జలాంతర్గాములు కిలోమీటర్ దూరంలో ఆగాయి, అంతకంటే ఒకదానికొకటి దగ్గరగా వచ్చే అవకాశం లేదు. సముద్రం ఇంకా అల్లకల్లోలంగా ఉంది. ఇరవై అడుగుల అలలు ఎగసిపడుతున్నాయి. జర్మన్ జలాంతర్గామి కెప్టెన్ మ్యూసెమ్‌బర్గ్ ఆ కిలోమీటరు దూరాన్ని రబ్బరు డింగీలో ప్రయాణించాలని చెప్పాడు.

"మరో మార్గం లేదా?" అడిగాడు బోసు ఎగసి పడుతున్న అలలను చూస్తూ. "కనీసం ఇంకాస్త దగ్గరకు వెళ్ల కూడదా?"

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS